
# జానపద గేయాలు



విశాలాంధ్ర ప్రచురణాలయం
విజయవాడ

398.2
ELL

A AOUA1033 129

# జానపద గేయాలు

(రెండవ సంపుటి)

1

*

సేకరణ:

'ఎల్లోరా'

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10313

విశాలాంధ్ర ప్రచురణాలయం,
విజయవాడ.

ప్రచురణ నెం. 839.
ప్రథమ ముద్రణ
ఆషాఢం, 1881
(జూలై 1959)

398.2
ELL

*

వెల : రు. 1-25.

*

ముద్రణ :
స్వతంత్ర ఆర్ట్సు ప్రింటర్సు,
విజయవాడ.

3

# మనవి మాటలు!

తెలుగు వాఙ్మయంలో జానపద వాఙ్మయానిది ఒక ప్రత్యేక తరహా - ఒక ప్రత్యేక శాఖ!! ఇందులో రకరకాల ఛందోరీతులలో అల్లబడిన అనేక తరహాల గేయములు. పాటలు. కథలు వున్నాయి. జానపద వాఙ్మయానికి వున్న ప్రత్యేక లక్షణాలలో సూటిగా చెప్పదలచుకున్నది చెప్పడం, ఇంపుగా ప్రజల కర్థమయ్యే భాషలో రచించబడడం!

ఈ తరహాకు చెందిన జానపద కవితలు పూర్వకాలపు రోజులలో అంతగా ఆదరించబడినట్లు కనుపించదు. ఈనాడు మధురకవిత లనదగిన యీ జానపద వాఙ్మయం తెలుగు సాహిత్య శాఖలలో ఒక శాఖగా గుర్తించబడడం, ఆదరించబడడం, పునరుద్ధరించబడడం గర్వించదగినదే!

ఇంతదాకా జానపద గేయాల సంరక్షణకు అంతగా కృషి జరుగలేదనే చెప్పవలసి యుంటుంది. జరిగిన కాస్తపని అయినా యే కొలదిమంది వ్యక్తుల ద్వారానో జరిగింది. ఈ నాటికైనా సంస్థలు కదిలి వీటి పునరుద్ధరణకు పూనుకోవడం ముదావహం!

తెలుగు జానపద రచనలను సంపుటాలుగా వెలువరించదలచిన, కనీసం కొన్నివేల సంపుటాలనైనా ప్రచురించవలసి యుంటుంది. అంతటి పనిని కొలది మంది వ్యక్తులు, ఒకటి రెండు ప్రచురణ సంస్థలు తలచుకొని సాధించే పనికాదు. అందుకు అన్ని సాహితీ సంస్థలూ కదిలి నిర్మాణాత్మకమయిన, నిస్వార్థమయిన కృషి చేయగలగాలి.

సేకరించడం, సరిపుచ్చడం, సంకలనంగా రూపుదిద్ది వాటికి ఒక పుస్తక రూపం యివ్వడం చాలా కష్టమయిన పని అయినా, తెలుగు ప్రాచీన కవితలను తిరిగి పునరుద్ధరించి వాటికీ నాగరిక లోకంలో ఒక స్థానం కలుగజేయాలనే తలంపుతో - నేను ఎన్నో సంపుటాలను సేకరించి, వాటిని సరిచూసి, వాటిని ఆంధ్ర ప్రజలకు అందివ్వడం కోసం కృషిచేస్తూన్నాను.

ఆ కృషి ఫలితంగా, విశాలాంధ్ర ప్రచురణాలయంవారు నా "జానపద గేయాలు" ప్రథమ సంపుటాన్ని 1954 లో పుస్తకరూపంలో - చక్కని గెటప్‌లో

వెలువరించి, నన్ను ప్రోత్సహించడంతో పాటు తెలుగు సాహిత్యోద్యమానికే ఎంతో మేలును చేకూర్చారు.

తెలుగువారి ఆచార వ్యవహారాలనూ, జీవిత సత్యాలనూ చరిత్రలనూ కను లకు కట్టినట్లుగా వినిపించే జానపద గేయాలు సేకరించవలసిన అవసరం విశా లాంధ్ర సాధించుకున్న మనమీద ఎంతగానో వుంది. ఆ అభిప్రాయంతోనే ఎన్నో సంపుటాలను నేనూ సేకరించాను. వాటి యింపుసొంపులను (కామెంట్రీతో సహా) ఆలిండియా రేడియో (మద్రాసు) కేంద్రం నుంచి సుమారు 9 సంవత్సరాలుగా ప్రసారితం చేస్తూ వినిపిస్తున్నాను.

ఆ విధంగా ప్రచారం చేయబడిన చక్కని గేయాలను 1954 మొదటగా పుస్తకరూపంలో వెలువరించిన విశాలాంధ్ర ప్రచురణాలయం వారే తిరిగి నా సంపుటాల నుంచి రెండవ ప్రతిని ప్రచురించి ఆంధ్ర ప్రజలకు అందివ్వ బూనుకున్నారు.

ఇటువంటి స్వార్థరహిత సేవ అన్ని వైపులనుంచీ వచ్చిననాడు తెలుగు సంస్కృతి విశ్వపీఠాన్ని అలంకరిస్తుం దనుటలో సందేహం లేదు। ఇకముందు విశాలాంధ్ర ప్రచురణాలయం వారు జానపద వాఙ్మయంమీద సమీక్షాగ్రంథాలను వెలువరించి దేశి సారస్వతమును ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

నా జానపద గేయసంపుటాలను చూసి ఎంతో సంతోషంతో, ప్రోత్సహించి అడుగగానే తొలిపలుకు వ్రాసి యిచ్చిన డాక్టరు గిడుగు వెంకట సీతాపతిగారికి నా వందనాలు।

నా జానపద సంపుటాలను వరుసగా ప్రచురిస్తూ నా కృషికి చేయూత నిస్తూన్న విశాలాంధ్ర ప్రచురణాలయంవారికి, నా రచనలను ఆదరిస్తూన్న ఆంధ్ర ప్రజానీకానికి నా అభివందనాలు।।

"ఎల్లోరా"

★

# తొలిపలుకు

జానపద జీవితాన్ని ప్రతిఫలింపజేసే వాఙ్మయంలో జానపద గేయాలు ఉన్నతస్థానాన్ని పొందదగినవి. అందులో జానపదుల నిత్యకృత్యాలే ఎక్కువగా కనబడుతూవున్నా అవి రసవంతంగాను హృదయరంజకంగాను రచితము లయినవి. మాయామర్మ మెరుగని వారి జీవితాలు సహజసిద్ధములైన రాగద్వేషాలకు లోనైనా ఉదాత్తములయిన భావాలతోను. అవ్యాజములయిన ఆశయాలతోను, మృదుమధురములయిన పలుకులతోను. సరళమయిన నడవడితోను నదులలోని నిర్మలోదకములవలే ఎట్లు సాగుతూవుంటవో జానపద గేయాలు తెలియజేస్తూ ఉంటవి. ఉన్నదానితో తృప్తిచెంది. తృణం మేరువుగా చూచుకొని ఉత్సాహంతో ముందుకు పోగల శక్తి జానపదులలో యెక్కువగా గోచరిస్తూ ఉంటుంది. ఊహాగానంలో వారు సర్వస్వతంత్రులు; మేఘాలలో బొమ్మలు చిత్రించుకోగలరు; బొమ్మలతో ప్రసంగించగలరు; ఆకాశంలో మేడలు కట్టుకోగలరు; రెక్కలు కట్టుకొని పైకి ఎగరగలరు; బ్రహ్మసృష్టికి మెరుగులు దిద్దగలరు; ధర్మదేవత అధర్మాలను అధిక్షేపించగలరు; దుష్టదేవతలకు పొలిమేరనే ఉపహారాలు పెట్టి పొమ్మనగలరు; సరసంగా సరసాలాడగలరు; పొలయలుకలు మెలుకువతో తీర్చుకొని పొత్తుపడగలరు; కష్టాలలో సుఖాలు చూడగలరు; తోడివారల సుఖదుఃఖాలు సమంగా పంచుకొని సహకరించగలరు; సంఘజీవిత మెట్లుండవలెనో నవనాగరకులకు బోధించగలరు. ఈ సద్గుణములన్నీ జానపద గేయాలలో ప్రతిబింబితము లవుతూ ఉంటవి.

జానపద గేయాలను భాషాలక్షణానికి లక్ష్యంగా లక్షణజ్ఞులు గ్రహించలేదు. వారి భాషానుశాసనము ప్రబంధాది కావ్యరచనకు వర్తింపజేసినట్లు యీ జానపద గేయాలకు వర్తింపజేయక యీ గేయాల యెడల పండితులు ఉదాసీనులై ఉండడం వల్ల మేలే కలిగినది. ఆ పండితులు ఆ శబ్దానుశాసనాలకు ఈ జానపద గేయాలను బంధించివుంటే యివి కావ్యాలవలెనే ఏ వికృత కృతక భాషలోనో రచయితములై యుండును, అట్టి దుస్థితి కలుగలేదు, కనుకనే ఇవి సరళమైన శయ్యతో సాగుతూ వచ్చినవి. అయితే, పండితుల ఆదరణ లేకపోవుటచేత ఒక కీడుకూడా కలిగినది.

కావ్యాలు తాటాకులమీదికి ఎక్కినట్లు యివి ఎక్కలేదు. అందుచేత కేవలం అనుశ్రుతంగా మాత్రమే వచ్చినవేవో నిలచినవి; తక్కినవి అంతరించినవి. ఆదినుండి నేటివరకు రచితములవుతూ వచ్చిన జానపద గేయాలు, సామెతలు మొదలయినవి నిలిచివుంటే సంఘజీవితము, భాష ఎట్లు పరిణమిస్తూ వచ్చినదో తెన్నగా గ్రహించగలుగుదుము. అట్టి సద్భాగ్యము మనకు లభింపలేదు.

జానపద గేయాలలో గ్రహించుటకు యోగ్యమయిన విశిష్టలక్షణము ఎక్కువగా ఉన్నది కనుకనే వాటి సంగ్రహణమునకు విలువ హెచ్చినది. అట్టి జానపద గేయాలను - కాలగర్భంలో మడిసిపోయినవి పోగా, నేటి కింకా పల్లెలలో జానపదుల పెదవులపై తాండవిస్తూ, వీనులవిందుగా వినబడుతూ వున్నవాటినైనా సేకరించడం సంస్కృతిగలవార మనుకొన్న మనకు విహితధర్మం. ఆ ధర్మమును నిశ్చలభక్తితో నెరవేర్చుటకు దీక్ష వహించి, శక్తివంచన లేక తీవ్రమైన కృషిచేసి కృతకృత్యులయిన "ఎల్లోరా" గారికి నా అభివందనాలు!

ఈ జానపద గేయాలను రచించిన వారెవరో మనకు తెలియదు. వారు తమ నామధేయాలను యథాతథంగా గాని, "ఎల్లోరా" వంటి ఉపపదాలతో గాని తమ గేయాలలో పొందుపరచుకోలేదు. వారు ఏనాటివారో స్పష్టంగా తెలియదు. అయినా, కొన్ని విశేషాలను బట్టి కాలనిర్ణయం, దేశనిర్ణయం కొన్ని గేయాల విషయంలో చేయగలము.

ఏయే గేయాలలో కొద్దిగానయినా పాతపడ్డ నుడికారం కనపడుతుందో, ఏయే గేయాలు మన బాల్యంలో మన ముసలమ్మలు, తాము తమ బాల్యంలో తమ ముసలమ్మలు పాడగా విని నేర్చుకొన్నామని చెప్పి వినిపించారో, ఏయే గేయాలు తెలుగువారు గల అన్ని ప్రదేశాలలోను ఇంచుమించు ఒకే విధమున నేటి కింకా వినబడుతూ ఉన్నవో అవి ప్రాచీన - లేదా చాలాకాలం క్రిందటి జానపద గేయాలని మన మూహించవచ్చును. "గుమ్మడేడే గోపిదేవీ", "కృష్ణమ్మా గోపాలబాలా కృష్ణమ్మా" మొదలయిన గేయాలున్నూ, మేలుకొలుపు పాటలున్నూ, శ్రీకృష్ణ లీలలున్నూ - ఇంకా ఇటువంటివి మరికొన్నిన్నీ చాలాకాలం క్రిందటనే రచితములయి ఉండవలెను. కథావస్తు సంఘటితములయిన కాటమరాజు, దేశింగ్ మొదలయిన గేయాలు ఆయా వీరుల చర్యలు జరిగిన కాలంలోనో, ఆ తర్వాతనో రచితములయి ఉండవలెను. "బత్తాయిచెట్టు", "బత్తాయిపండు" అనే మాటలు గల పాటలు బటేవియానుండి నారింజపండ్లు మన దేశానికి వచ్చిన తర్వాతనే పుట్టియుండవలెను. ఈ విధంగా "లోలకులు పెట్టిందిరా పిల్ల", "లుంగీయేసుకు", "వాచీపెట్టి", "పకోడీలు", "బేసరి", "రైలుబండి", "రోడ్డు" మొదలయిన అన్యదేశ్యములు గల గేయాలు ఇటీవలవి అని చెప్పవచ్చును గదా! ఈ విధంగానే

గుంటూరు, పల్నాడు, గోదావరి, కృష్ణవేణమ్మ, భద్రాద్రి, దాచేపల్లి మొదలయిన ప్రదేశాలకు అంకితములయిన గేయాలు ఏయే ప్రాంతాలలో పుట్టియుండవచ్చునో ఊహించుకోగలము.

ఒక హెచ్చరిక. ఇటీవలవారు - జానపదులు కారు నవనాగరకులే - రచించిన పాటలుకూడా కొన్ని జానపద గేయాలక్రింద చెలామణి అవుతున్నవి. అందుకు నా యనుభవమే తెలియజేస్తున్నాను. 1908 లో నేను రచించిన చిలుకమ్మ పెండ్లి, రైలుబండి పాటలు గుంటూరులో వెల్వడుతూ వుండిన 'వివేకవతి' అనే మాసపత్రికలో ప్రకటితములయినవి. అందు నాపేరుకూడా రచయితగా ముద్రితమయినది. దరిమిలాను నా యనుజ్ఞపొంది లాంగ్‌మన్స్, మాక్‌మిలన్ వారు తమ వాచకములలో చేర్చుకొన్నారు. ఆ తర్వాత కొందరు జానపద గేయాలంటూ ఒక చిన్న గ్రంథము ప్రకటించి అందులో నా చిలుకమ్మ పాట నాపేరు లేకుండా చేర్చుకొన్నారు. ఈ విధంగా ఇంకా ఇటువంటి ఆధునిక రచనలు ఎన్నిచేరినవో।

సరే। ఇటువంటి ప్రక్షిప్తాలవలన కలిగే బాధ అంత గొప్పదికాదు. కాని, వాస్తవమయిన జానపద గేయాలు ఇంకా అక్కడక్కడ వినబడుతూ వున్నవే గ్రంథాలలోనికి ఎక్కకుండా వున్నందుకు ఎక్కువగా చింతించవలసియున్నది. జానపద గేయాల సేకరణ ఒకరిద్దరివల్ల పూర్తి కానేరదు. అమెరికావంటి దేశాలలో యీ పనికి ప్రత్యేక సంస్థలు ఏర్పడి ఉన్నవి. ఇందుకు కావలసిన పత్రికలున్నవి. జానపద వాఙ్మయ గ్రంథాలు - కథలు, గేయాలు, సామెతలు మొదలయిన శాఖలకు చెందినవి వందలకొలదిగా ఉన్నవి. ఈ పనికి ప్రభుత్వము వారు, విశ్వవిద్యాలయములు, ఇతర విద్యాసంస్థలు పూనుకొనవలెను.

జానపద గేయాలను సేకరించే పని ఇంత కష్టమైనదైనా "ఎల్లోరా" గారు శ్రద్ధవహించి పెక్కు గేయాలు సేకరించి ప్రకటిస్తూ ఉన్నందుకు వారున్నూ, వీటిని చక్కగా ముద్రిస్తూ ఉన్న విశాలాంధ్ర ప్రచురణాలయం వారున్నూ దేశాని కెంతో మేలుచేసినవారని చెప్పవలెను. వీరి కృషి ఇతోధికంగా ఫలించునుగాక।

*గిడుగు వెంకట సీతాపతి.*

★

# గింజజల్లుడు

నాగన్న జల్లుతే
నవ్వుతుందీ మొలకా –
నా రాజు జల్లుతే
నాన్యమీా మొలకా –
రంగన్న జల్లితే
రాజనాలీ మొలకా –
లచ్చన్న జల్లితే
పొంగుతుందీ పైరు –
ముద్దులాంటి ఆ మొలకా
ముత్యాల మొలకా –
కదిపితే రతనాలు
రాల్చేది మొలకా –

# పడవపాట

హైలేసో హైలేసో
హైలేసో హైలేసో
అల్లంత గుడికాడ
హనుమంతా గుడికాడ
నావాలా నాపేసీ
హారతూ లిద్దామా.
లంగర్లూ దింపేసీ
దండాలూ పెడ్దామా.
హైలేసో హైలేసో
హైలేసో హైలేసో
బండాడూ మనవాడూ

బలశాలీ మనవాడూ
పడవోళ్ళ పాలిటీ
దండాలా దేమూడూ...
హై లేసో హై లేసో
హై లేసో హై లేసో

## పిలుపు

తలమీద కొచ్చాడు
తండ్రి సూరీడూ!
యిలలోన జనులెల్ల
యిసిగిపోనారూ!
కొడవలీ మొలనుంచి
కోత సాలించి
రావోయి బే బేగ
రంగన్న బావా.
మొకమెల్ల కప్పింది
ముత్తేల సెమటా
ఒళ్లెల్ల వాసివాడి
కందిపోనాది
కొడవలీ మొలనుంచి
కోత సాలించీ
రావోయి బే బేగ
రంగన్న బావా.
బంగారు నీ మోము
వాసివోడి పోయే
ఒళ్లెల్ల కందింది
వెర్రి నా బావా.

కొండవలీ మొలనుంచి
కోత సాలించీ
రావోయి బే బేగ
రంగన్న బావా.
సెలయేటిలో మునిగి
సెవంట కడిగేసి
సరసనూకూకోని
సల్దారగించూా
కొండవలీ మొలనుంచి
కోత సాలించీ
రావోయి బే బేగ
రంగన్న బావా.

## బుడుగో - బుడుగో

వానల్లు కురవాలి
వరిచేలు పండాలి
బుడుగో – బుడుగో.
మాగాాదె నిండాలి
మాదాసి దంచాలి
బుడుగో – బుడుగో.
మా అమ్మ వండాలి
మా బొజ్జ నిండాలి
బుడుగో – బుడుగో.

# పసిడి పల్కులు

ఇల్లు కట్టుదామా ?
ఏమి యిల్లు
పెంకుటిల్లు
ఏమి పెంకు
వార పెంకు
ఏమి వర
తామర
ఏమి తామర
మెట్ట తామర
ఏమి మెట్ట
కొండమెట్ట
ఏమి కొండ
బొగ్గు కొండ
ఏమి బొగ్గు
నేల బొగ్గు
ఏమి నేల
గచ్చు నేల
ఏమి గచ్చు
పాల గచ్చు
ఏమి పాలు
బర్రె పాలు
ఏమి బర్రె
చుక్క బర్రె
ఏమి చుక్క
చారు చుక్క
ఏమి చారు

బియ్యపు చారు
ఏమి బియ్యము
ఊచ బియ్యము
ఏమి వూచ
జొన్న వూచ
ఏమి జొన్న
మొక్క-జొన్న
ఏమి మొక్క
మామిడి మొక్క
ఏమి మామిడి
అంటుమామిడి
ఏమి అంటు
మల్లె అంటు
ఏమి మల్లె
గుండు మల్లె
ఏమి గుండు
ఇనప గుండు

# కోకిలపాట

కాకులే దూరనీ
కారడివిలోను
కాపురం చేస్తినే
కాకమ్మ నేను
చీమలూ దూరనీ
చిట్టడివిలోనూ
చీకు చింతా లేక
వున్నాను నేను.
ఇల్లయిన కట్టలేని
ఇల్లాల్ని నేను
పిల్లల్ని పెంచలేని
పెద్దమ్మ నేను... ॥కా॥

దక్షిణాయనం
వచ్చింది
తల్లియింటికెల్లి
దక్షిణాయనం
వెళ్లాక
మళ్లివస్తానే... ॥కా॥

కోయిలమ్మ వచ్చింది
కోనల్లుదాటి
చిలకమ్మ చెప్పింది
అమ్మతో పోయి
కోయిలమ్మ వెళ్లింది
కోటలెల్ల దాటి.
నెమలి ఎదురెల్లింది

నేనుపుగ పిలువ.
మల్లెలూ పూచాయి
మా పెరటిలోనూ
మావిళ్లు చిగిర్చాయి
మా తోటలోనూ.
మనమంత వాసంతం
బాగ గడపాలి......॥ కా॥

నీవు పాడు పాటలకు
రాళ్లైన కరుగు
నేను చేసే నాట్యానికి
మనసెల్ల కరుగు......॥ కా॥

పుట్టిన యింట
హాయిగ ఆడీ, పాడి
అత్తారింటను
నోరుమూసుకో
కొ(రాలెన్నో
తాటీ పండూ
సారీ తీసుకువెడ్తాను
మళ్ళీ ఆరు నెల్లకొస్తాను
నను మరువకండి......॥ కా॥

# మరువలేనే

అందాలాదానా
ఆనందాపూ దానా
చాశెడూ కళ్ళాదానా
మిసిమీ వన్నేలాదానా
బంతులా బుగ్గాలాదానా
గుబురూ కేశాలాదానా
నిన్ను నేనూ
మరువమన్న మరువాలేనే
నిన్ను మరువమన్నా మరువాలేనే

ధవళాపళ్ళావరుసాదానా
అందచందాలదానా
తేనేలొల్కే పల్కులదానా
నాతీనడకాలాదానా
చంద్రాచూపూలాదానా
హంసానడుమూలాదానా
తీరైనా కనులాదానా
నిన్ను నేనూ
మరువమన్నా మరువలేనే
నిన్నూ-మరువమన్నా మరువలేనే

# చందమామ

చందమామ రావే
జాబిల్లి రావే
కొండెక్కి రావే
కోటివేలు తేవే
బండెక్కి రావే
బంతిపూలు తేవే
తేరుమీద రావే
తేనెపట్టు తేవే
అన్నీ తెచ్చి
మా పాప కియ్యవే.

# చెమ్మచెక్క

చెమ్మచెక్క
చారడేసి మొగ్గ
అట్లు పొయ్యంగ
ఆరగించంగ
అరచేతిలో గవ్వ
ఆడుకుందాం రండి
సుబ్బారాయుడి షష్టి
చూసొద్దాం రండి
ఆకుపువ్వుల దండ
అడిగివద్దాం రండి
ఆరుబైట స్థలంలో
ఆడుకుందాం రండి

ముత్యాలచెమ్మచెక్క
ముగ్గులెట్టంగ
రత్నాల చెమ్మచెక్క
రంగులెయ్యంగ
చెమ్మ చెక్క
చారడేసి మొగ్గ.

## హూత్

ఉడతా ఉడతా హూత్
ఎక్కడి కెళ్ళావ్ హూత్
కానూరెళ్ళా నూత్
ఏమి తెచ్చావ్ హూత్
కందులు తెచ్చా హూత్
ఎక్కడి కెళ్ళావ్ హూత్
ఏలూరెల్లా హూత్
ఏమి తెచ్చావ్ హూత్
బెల్లము తెచ్చాను హూత్
ఎవరికిచ్చావ్ హూత్
అబ్బాయికెట్టాను హూత్.

## నిరాశ

ఎన్నాళ్ళు పాటుబడిన
ఈ గుణపమే మిగులు
ఎందుకోయీ యీ జన్మ
ఓ రన్నా
కంటరాక్టరు మేడ
కలకటేరూ మేడ
కట్టించుకు కష్టపడక
సౌఖ్యాలూ పొందుతుంటె
ముందూ మనకేదంచు
మోసాపోతూ ఉంటే
ఎండసిగనో మాడుతున్న
గంజిముంతకు బరువులేదు
గంగమ్మతల్లి చలువకు
తిరుగు లేదూ.

## చేతి ఆట

గుడి గుడి గుంచం
గుండారాగం
పాములపట్నం
పడగా రాగం
కత్తైనా బద్దైనా
వేస్నిళ్ళా ? చన్నిళ్ళా ?

# దంపుపదాలు

వానా దేముడ నీకూ
వరుసా చెల్లెల్నీ
వర్షాలూ కురిపించో
పరిచేలాలోనూ.
పండాయీ మాచేలూ
పండంటే మా చేలూ
నూర్పించీ తెచ్చారూ
నూరూ గరిసెల్లూ
పండించీ తెచ్చారూ
పంటా కాపుల్లూ.
ఎక్కాలేనీ గట్లూ
దిగలేనీ మెట్లూ
చూలింతా పోశారూ
చుక్కాలా పొడుగూ.
బాలింత పోశాగూ
పర్వతాలా పొడుగు.
మా నెత్తో పులగామూ
మా ఎడ్లే మేసేయీ.

# దున్నే పాట

బిక్కవోలు భీమయ పొలము
ముప్పయి మూడెకరాలు
కౌలుకయిన రాసుకుందామా
మనదున్న పిల్లని సరదాగా
దున్నుకొందామా.
కోటిపల్లి తీర్థమెల్లి
కోటిగొనుపుల కర్ర తెచ్చి
సిన్నము లేద్దామా
మన దున్న పిల్లను సరదాగ
దున్నుకొందామా.
వాకాడ సంతకెళ్ళి
వాటమైన కర్ర తెచ్చి
సిన్నము లేద్దామా
మన దున్నపిల్లని సరదా గా
దున్నుకొందామా.
వచ్చే వట్టి గడ్డి
పండే పెసర పొట్టు
దున్నే దున్నకు పెడదామా
మన దున్నపిల్లని సరదాగ
దున్నుకొందామా.
దుక్కే దున్నపిల్ల
ఎక్కే ఎడ్ల బండి
పల్లె పాటపాడుకొందామా
మన దున్నపిల్లని సరదాగా
దున్నుకొందామా.

# దంపుపదం

ఇల్లలికి ముగ్గెట్టి
యింత పని చేసి
ఈ యింటి సుందరి
ఎందుపోయింది ?
సుందరి పుట్టిల్లు
చూడబోయింది
అన్నలతో వియ్యమ్ము
లందబోయింది.
వదినలతో వాదమ్ము
లాడబోయింది.
వచ్చేవె పోయేవె
ఓ రామచిలుకా
వచ్చి మా కన్నారి
వార్త తెలుపవె
పొద్దున్న వచ్చేవు
బొంకేవు చిలుక
న్యాయములు పలుకవే
నా బాలతోడు.
పట్టుచీర కొన్నారు
పయనమైనారు
పణతి మీ అన్నలు
వస్తమన్నారు
వెలచీర కొన్నారు
వేడ్కపడ్డారు
వెలది మీ అన్నలు
వస్తమన్నారు.

చద్దెన్నం కడివెడు
చల్ల కడవెడు
చాల ఆవులమంద
నాకు కావలెను
వేడన్నం కడివెడు
వెన్న కడివెడు
వేయి ఆవులమంద
నాకు కావలెను.

## పిండి విసురు పాట

అత్తాకీ మందూ పోసీ
మామాకీ బంగీ పోసీ
యిద్దర్నీ సాగానంపే
పెళ్ళాడే బొమ్మా...... ॥అత్తా॥

బదినాకు కల్లూ పోసీ
మొగుడీకీ బ్రాందీ యిచ్చి
యిద్దర్నీ కూరోచ్చెబెట్టి
వాడాకు మూటాకట్టే
పెళ్ళాడే బొమ్మా...... ॥అత్తా॥

రంగాము చూసుకోని
మూర్మాను చూసుకురావే
అప్పూడు నీ సోకూ చూడే
పెళ్ళాడే బొమ్మా...... ॥అత్తా॥

# కోతలపాట

అద్దరి కోతలకూ
యెల్లొద్దారే
అద్దరూపాయి
డబ్బులకూ
అసలే రానూ... ॥అద్ద॥

చుక్కా పొడిసిన యేలకి
సోకూ చేసుకొని
లచ్చి నాతో రాయె
యెల్లొద్దారే... ॥అద్ద॥

సెవులలోనూ కమలాలెట్టి
ముత్తాలాబావిలీ లెట్టీ
చుక్కాలా రయికా తొడిగీ
కరగంచు సీరాకట్టీ
కళ్ళాకీ కాటూకెట్టీ
అద్దారి కోతలకి
యెల్లొద్దారె...
నా సోకూ కేమిగానీ
నీ సోకూ సూసుకోరా
మూటాముల్లే కట్టూకోనీ
ముందూ నే నొత్తానూరా ॥అద్ద॥

కాయా పంచలు కట్టూకోనీ
కిర్రూ చెప్పులు
తొడుగూ కోనీ
పొన్నూకర్రా చేతాబట్టీ

పోకాకత్తీ మొల్లో చెక్కి
అద్దారి కోతలకూ
ఎల్లొద్దారీ... ॥అద్దా॥

గిత్తా దూడని
ఎంటాబెట్టుకు
కోడీపిల్లని
సంకాబెట్టుకు
పగస్సుట్టేమో
నోట్లోపెట్టుకు
పొగలేత్తూనూ
లేసీ రారా
అద్దారీ కోతలకూ
ఎల్లొద్దారీ... ॥అద్దా॥

## సిన్ని - సూరి

మా సిన్ని సూసింది
మంచి కొర్రోణ్ణి
మనసైతే యిచ్చింది
మాటాడలేదు
కులముగలవోడమ్మ
గునముకలవోడు
వాయిలేనోడమ్మ
మారైతుబిడ్డ
మారాణి మా సిన్ని
మారాజువాడు
సిన్నిసూసిన సూపు

సిగ్గాల సూపు
సూరి సూసిన సూపు
సూదుల సూపు
సూపు కలిపేనమ్మ
చిన్ని మా సిన్ని
మాటగలిపేడమ్మ
మంచోడు సూరి
సూరి సిన్నులు కలసి
సరసమాడంగ
మబ్బుల్లో సెంద్రుడూ
సిగ్గుపడ్డాడు
సుక్కలన్నీ గూడి
పక్కున్న నవ్వి
తలంబ్రాలు సల్లేయి
తలమీదానూ......

## చెరుకుతోట పాట

నీది బాగుందె బుచ్చప్ప
సెరుకు తోట.
రంగు రంగూలకఱ్ఱ
గుంపూ గుంపూలకఱ్ఱ
నీది బాగుందె
బుచ్చెప్పా బాగుందె
సెరుకుతోట బాగుందె...

వ. ఎందుకు బాగుండదు?
ఉన్నవారైదుగురు

కూకుంటే మెడతాకు
నిలబడితే మెడతారు
తోటకి
నీరు మెడతారు
నాది మే టేసుకుపోనాది
బుచ్చప్పా మే టేసుకు పోనాది
సెరుకుతోట మే టేసుకుపోనాది

వ. ఏటిపిల్లా నీ కర్మం ?
ఉన్నవాడొక్కడు
వోటోడై పోనాడె
బుచ్చప్పా వోటోడై పోనాడె
ఎక్కమంటె ఎక్కనేడు
యాతం
నడువులు నొప్పంతాడు
కాళ్ళూ రావంతాడు
నా గెహచారం కాలిపోను
మే టేసుకుపోనాది - నాది
బుచ్చప్పా మే టేసుకు పోనాది
సెరుకు తోట మే టేసుకుపోనాది
నీది బాగుండె బుచ్చప్పా
సెరుకు తోట.

# చందమామో?

చందమామో
ఓ చందమామో
రాత్రికి రాత్రికి
వస్తావనీ — చందమామో
రాతీ గంధం
తీసీ ఉంచితి ,,
ఎప్పూ డెప్పుడు
వస్తావోనని
ఎలగా చెట్టు
నీడానుంటి ,,
ఇప్పూడిప్పుడు
వస్తావాని ,,
ఇప్పా చెట్టూ
నీడానుంటీ ,,
ఇప్పుడెప్పుడు
రాకుం టేనూ ,,
ఇప్పాపువ్వే
రాలినాదీ ,,
మల్లీ మరళి
వస్తావానీ ,,
మల్లీ పొదనా
నిలచీయుంటీ ,,
మల్లీ పొదా
మాటలు వినీ ,,
మల్లీ పువ్వే
రాలీ నాదీ ,,

# వియ్యపురాలి పాట

మంగళం జయా మంగళం
మా ఒదినెగారీ వన్నెలాకూ
జయామంగళం
వన్నెలాడి వదినెగారూ
వయ్యారముతో పెండ్లికి వస్తే
పెండ్లి పందిరి గడగడ వణికే
దీపములన్నీ తలలువంచే... ॥మంగ॥

చక్కని మా వదినగారూ
వంకర నడకతో కూలాబడితే
ప్రక్కనున్న మరదలు వెళ్ళి
ఎత్తి నిలపీ మన్నూ దులపే... ॥మంగ॥

మడికట్టుకు ఒదినేగారూ
తులసీపూజకు వెడుతూవుంటే
గాలివేసి పయిట ఒసవే
కూతురు వెళ్ళి పైటాదిద్దే ॥మంగ॥

ప్రేమాతో అరటీపండూ
వియ్యపురాలీ చేతికి స్తే
తినుటా ఎరుగని వియ్యపురాలు
తొక్కతో మింగి కక్కూకొనెనూ ॥మంగ॥

చింతమానూ చిగురూచూడూ
మూతి తిప్పుచు మాటాలాడుచు
వయ్యారముతో నడకే చూడు ॥మంగ॥

# బస్తాపాట

వస్తావటోలె పిల్ల
వస్తావంటె నిన్ను
వరంగల్లు తీసుకుపోత
వస్తావంటే.

నన్ను వరంగల్లు
తీసుకుపోతే వస్తానుగానీ
మనదారిఖర్చు దప్పిఖర్చు
తెస్తావటోయి.

మనదారి ఖర్చు
దప్పి ఖర్చు తెస్తానుగానీ
అడుగుదాటకుండ మాటయింటూ
ఉంటావటే.

అడుగుదాటకుండ
మసులుకుంటువుంటానుగానీ
మాటపేచేరాకుండగాను
చూసుకుంటావా.

పోటీరాకుండగాను
చూసుకుంటానుగాని
పోకిళ్ళు పోతావుంటే
కూకలెడ్తాను.

# పెండ్లి మాటలు

చిట్టీ మీరేమిటి వారే
చిట్టెక్కా మీరేమిటి వారే
పూర్ణీ మీరేమిటి వారే
పూర్ణక్కా మీరేమిటి వారే
తామర మొగ్గల్లా.

చిట్టీ మేం వ్యాపారులం
చిట్టెక్కా మేం వ్యాపారులం
పూర్ణీ మేం వ్యాపారులం
పూర్ణక్కా మేం వ్యాపారులం
తామర మొగ్గల్లా.

చిట్టీ మీ వ్యాపారమేమి
చిట్టెక్కా మీ వ్యాపారమేమి
పూర్ణీ మీ వ్యాపారమేమి
పూర్ణక్కా మీ వ్యాపారమేమి
తామర మొగ్గల్లా.

చిట్టీ మేం రత్నాల వ్యాపారులం
చిట్టెక్కా మేం రత్నాల వ్యాపారులం
పూర్ణీ మేం రత్నాల వ్యాపారులం
పూర్ణక్కా మేం రత్నాల వ్యాపారులం
తామర మొగ్గల్లా.

గుజగుజ రేకుల పిల్లుందా
గుజ్జా రేకుల పిల్లుందా
స్వామీదండల పిల్లుందా

సహరాజులు మెచ్చే పిల్లుండా.
గుజగుజరేకుల పిల్లుందీ
గుజ్జా రేకుల పిల్లుందీ
స్వామీ దండల పిల్లుందీ
సహరాజుల మెచ్చే పిల్లుందీ.

గుజగుజరేకుల పిల్లాడున్నాడా
గుజ్జా రేకుల పిల్లాడున్నాడా
స్వామీదండల పిల్లాడున్నాడా
సహరాజులుమెచ్చే పిల్లాడున్నాడా

గుజగుజరేకులపిల్లాడున్నాడు
గుజ్జా రేకులపిల్లాడున్నాడు
స్వామీదండల పిల్లాడున్నాడు
సహరాజులుమెచ్చేపిల్లాడున్నాడు

గుజగుజరేకుల పిల్లనిస్తారా
గుజ్జా రేకుల పిల్లనిస్తారా
స్వామీదండల పిల్లనిస్తారా
సహరాజులు మెచ్చగ పిల్లనిస్తారా.

గుజగుజరేకుల కట్నమెంత
గుజ్జా రేకుల కట్నమెంత
స్వామీదండల కట్నమెంతా
సహరాజులుమెచ్చగ కట్నమెంత?

గుజగుజరేకుల జరీకుచ్చులు
గుజ్జా రేకుల చంద్రహారాలు
స్వామీదండల ఒడ్డాణం
సహరాజులు మెచ్చగ సూరీడూ.

గుజగుజ రేకుల మాకొద్దూ
గుజ్జా రేకుల మాకొద్దూ
స్వామిాదండల మాకొద్దూ
సహరాజుల మెచ్చగ మాకొద్దూ

గుజగుజ రేకుల పిల్లడి కట్నమెంత
గుజ్జా రేకుల పిల్లడి కట్నమెంత
స్వామిాదండల పిల్లడి కట్నమెంత
సహరాజుల మెచ్చగ పిల్లాడి కట్నమెంత.

గుజగుజ రేకుల రవ్వుంగరాలూ
గుజ్జా రేకుల కడియములూ
స్వామిాదండల హారములూ
సహరాజులు మెచ్చగ తురాయి.

గుజగుజ రేకుల మాకొద్దూ
గుజ్జా రేకుల మాకొద్దూ
స్వామిాదండల మాకొద్దూ
సహరాజులు మెచ్చగ మాకొద్దూ.

గుజగుజ రేకుల చీనాంబరాలు తెచ్చాము
గుజ్జా రేకుల జల్తరురవికలు తెచ్చాము
స్వామిాదండల పండ్లూపసుపూ తెచ్చాము
సహరాజులు మెచ్చగ పెండ్లికి వచ్చాము

# అలకపాన్పు

రావోయి రంగనాథ
నాగవిల్లికీ...
రానండి మామగారు
నాగవిల్లికీ...
పొద్దెక్కిపోయింది
పోరుపెట్టకోయి
వర్షాలు వస్తాయని
వర్జులన్నారూ...
మూడు కాసుల
మురుగులిస్తే
లేచి వస్తానో...
అష్టావర్ణం పెంచీనేను
పిల్లా నిస్తీనీ
ఏమీా యిచ్చిన
నీకూ ఉండవు
లేచీరావోయీ
కన్యతోటీ నీవూ బాగా
కదిలీ రావోయీ...
బావా మరదలు
బెల్లం ముక్కలు
తెస్తూ ఉన్నారూ
అలకతీర్చి గడ్డం క్రింద
బాగా తడ్తారూ...
మరదళ్ళంతా బుక్కా తెచ్చీ

వేచీ వున్నారూ
సిన్నూచూస్తే
సిగ్గూతోటీ
తలలూ వంచారూ...

## కూపుపాట

ఏటోరి బాబూ
సీటి మాటీకి
సీటి సూపమంతరూ
మాటి మాటీకి
తణికి సేత్తమంటరూ
సీటి లేకుండా రాలేదు
కూపుకూ,
అడ్డాకుకూ,
ఎవ్వుడో లెంకీ ఆ సోకుదారు
నాయాలు? ఏటమ్మా నిల్దీసి
అడుగుతుండు...??
ఎవురు నేదే
మన చింగంపిల్చేంకన్న
మనవఁడు ఈ మద్దెన పారెట్టు
గాడ్డయినాడు.
దించునీదీ నెత్తి బరువు
సూపించు నీది సీటి పిల్ల
కూపు సీటి కాకపోతే
ఆపు సేత్త నమ్మా
కేసు వూపు సేత్తనమ్మా.
వూపుసేసినట్టే వున్నావుబాబూ.

అడ్డాకుల మూటబాబు
సెడ్డా బరువుంది బాబు
ఎత్తితె దించలేము
దించితె ఎత్తలేము
సెప్పరాని కాడుంది
ఇప్పిసూసుకో సీటి
ఏం సెయమంటావ్ పిల్లా
ఉద్దోగ దరమం
ఒడినోడతలు పడి
సీటి తడిసిందేవఁమ్మో ?
బాబు సేతికి
తడి తగిలిందా ?
మీదనున్నయ్‌గదు పిల్లా
యిత్తిరాకులు - అటికి రాసేత్తాను
ఒద్దోయ్ బాబు
గాడ్డుబాబు
నేటి బాపనోళ్ళు గూడి
సాటిలేని టింఢివోండి
సంతరపన టింటారు
మంచిది యీ అడ్డాకు
ఏటోయి బాబు
సీటి మాటీకి సీటి
సూపమంతరూ
మాటి మాటీకి
తణికి సేత్తమంతరూ
సీటీలేకుండా రాలేదు
కూపుకూ,
అడ్డాకుకూ...

# చేనుకోత

పుట్టమీదా పాల
పిట్టోయి నాసామి
కొట్టబోతే తేలు
కుట్టేనోయ్.
మంతరించే జాన
లుంటే నాసామి
మల్లెమొగ్గా పాను
పేతూ నోయ్.
నేలనేలా నెల్లి
కూరోయి నాసామి
పాలపాలా బలుసు
కూరోయీ.
వాలుగొమ్మ చింత
సిగురోయ్ నాసామి
వండిపెడితే
వలపుతీ రేనోయ్.
అరుగుమీదా
అరటిపండోయ్ నాసామి
పండుమీదా మనసు
లుంటే నాసామి
పంతమేస్తే
పండురాదోయీ
ఎర్రచెరువూ గట్టు
కాడా నాసామి
చెప్పరానీ దుఃఖ
మొచ్చిందోయ్.

ఎడ్ల కేసే పోలి
కేకా నా సామి
నాకు యేస్తే
నేను రానోయీ.
సూపులేలా నీకు
పోరా నా సామి
మాటలుంటే
చేరి చెప్పోయీ.

## గుమ్మాడి

గుమ్మాడమ్మ గుమ్మాడి
ఏవూరెళ్ళింది గుమ్మాడి
ఏమి తెచ్చింది గుమ్మాడి?
ముంగండెళ్ళింది గుమ్మాడి
ములక్కాయ తెచ్చింది గుమ్మాడి
పుసులూరెళ్ళింది గుమ్మాడి
పూలుపూసింది గుమ్మాడి
ఏలూరెళ్ళింది గుమ్మాడి
వెలక్కాయ తెచ్చింది గుమ్మాడి
కాసలూరెళ్ళింది గుమ్మాడి
కాయలు కాసింది గుమ్మాడి
పండ్లు తెచ్చింది గుమ్మాడి
పాపాయికిచ్చింది గుమ్మాడి.

# తొక్కుపలుకులు

కొలువకు పోదాం
వస్తావా
ఏం కొలువ ?
రాజు కొలువ,
ఏ రాజు ?
అడవి రాజు,
ఏ అడవి ?
చిట్టడవి,
ఏం చిట్టు ?
సొర చిట్టు,
ఏం సొర ?
మంచి సొర,
ఏం మంచి ?
కాయమంచి,
ఏం కాయ ?
అరటికాయ,
ఏం అరటి ?
ఉక్కు అరటి,
ఏం ఉక్కు ?
నీ ముక్కు...

# తప్పట్లు

తప్పట్లోయ్
తాళాలోయ్
దేముడిగుళ్లో
బాజాలోయ్
పండ్లూ ఫలమూ
దేమునికోయ్
పాలూ ఉగ్గూ
పాపాయికోయ్

# హాలిపదం

ఒలే ఒలియ ఓలియో ఒలియా
రా వేలుగలవాడా రార హాలిగాడ
రావేలు పోబేలు రాశిపదివేలు
రావేలు నీదయ్యా రావిమాదయ్యా
పదివేలు గలవాడ రార హాలిగాడా.
పదివేలు నీదయ్య పంటమాదయ్యా
నూర్వేలు గలవాడ రార హాలిగాడా
నూర్వేలు నీదయ్య నూగుమాదయ్యా
వెయ్యేలుగలవాడ రార హాలిగాడా,
వెయ్యేలు నీదయ్య వెన్నమాదయ్యా
కోటివేల్గలవాడ రార హాలిగాడా,
కోటివేలు నీదయ్య కొండ్రమాదయ్యా
పోయెనే హాలిగాడు హాన్నూరుదాటి
వచ్చెనే హాలిగాడు పరగాణి బాట
వామెక్కి హాలిగాడు వాలలాడంగా

కుప్పెక్కి పొలిగాడు కూతవేయంగా
మఱ్ఱెక్కి పొలిగాడు మాటలాడంగ
జువ్వెక్కి పొలిగాడు జూదమాడంగ
పోతెక్కి పొలిగాడు బొబ్బటిల్లంగ
రాసెక్కి పొలిగాడు రంపటిల్లంగ
పొలిగాడు గొట్టంగ పోగాయెరాశి
పెయ్యాలు త్రొక్కంగ పెరిగనే రాశి
ఎద్దులు ద్రొక్కంగ మెదిసెనే రాశి
దున్నలు ద్రొక్కంగన న్నాయె రాశి
కోడెలు ద్రొక్కంగ కొదిసాగరాశి
కొండపీటి కొండల్ల దొప్పాయె రాశి
తిరుపతి కొండల్లె తీరెనేరాశి
రామలక్ష్మణులట్టరాసులు గలవు.

## బువ్వ

చేతులు కడిగి
అరటాకేసి
పప్పు పెట్టి
బువ్వ పెట్టి
కూరవేసి
నెయ్యేసి
చారోసి
మజ్జిగోసి
అత్తారింటికి
దారేదోయ్ ?
అంబలికొండకి
చిల్లేదోయ్...?

# పల్లెమామా

పడవాపు
పడవాపు
పల్లెమామా
పడవొడ్డు కట్టించు
పల్లెమామా
పచ్చి చాపల గంప
పల్లెమామా
బరువుగా
వుందోయ్
పల్లెమామా
ఓ ఓ ఓ పల్లె మామా... ॥ప॥

ఏవూరు దానవే
ఎఱ్ఱదానా
ఏ జాతిదానవే
పొట్టిదానా
నడేట్లో పడవకే
పడుచుదానా
గట్టులేదు
పుట్టలేదు
పల్లెదానా...
ఒడ్డూకడకు చేర్చుతాను
పల్లెదానా... ॥ప॥

తెరచాప
ఎత్తకోయి

షరంగు మామా
లంగ రేసి
పడవాపు
షరంగు మామా
సందె చీకటి
పడ్డాది
షరంగు మామా
గడవేసి ఒడ్డికిరా
షరంగు మామా... ॥ప॥

పడవొడ్డుకు వచ్చింది
పల్లెదానా
గంప్కదింపుతాను
రాయె పల్లెదానా
నా జాతి దానవనీ
పల్లెదానా
ముందుగా
చెబితేను
పల్లెదానా
ముందుగా
ఎక్కుదూవె
పల్లెదానా... ॥ప॥

# వెండిగిన్నె

కొండమీాద
వెండిగిన్నె
కొక్కిరాజు
కాలు విరిగె
దానికేమి మందు ?
వేపాకు చేదు,
వెల్లుల్లిగడ్డ,
నూనాయి బొడ్డు
నూటొక్కదార.

# విరహం

ఆకులమ్మే లచ్చిమీా
సిగురాకులమ్మే లచ్చిమీా
ఆకులమ్మిన రూకలన్నీ
ఏటి సేత్తివె లిచ్చిమీా... ॥ఆకు॥

కోడినిత్తానంటివి
కోడిపెట్టనిత్తానంటివి
గట్టిగా నే నింటికొత్తే
కొంటెగా తలుపేత్తివీ... ॥ఆకు॥

నేను సేసిన పాపమా
ఇది నాకు పట్టిన కరమమా
సక్కగానూ పక్కనుంటే
సొరగమేయిక సావునేడే...॥ఆకు॥

# సిన్నీ - బావా

సిన్నీ నా సిన్నీ
ఓ సన్నజాజుల సిన్నీ
పొన్నపూల సిన్నీ
నీ యన్నమీాద ఆన
న న్నేలుకోవే సిన్నీ
ని న్నొదిలి వుండలేను.

బావా - నా బావా
బంగారుముద్దుల బావా
నే క న్నెపిల్లదాన్ని
నా కన్నవారి తోడు
ఎన్నటికీ నిన్నే
నే నేలుకుంటానోయి
ఉన్నదాన్ని గాను
నా ఉసురుబోసుకోకు.

సిన్నీ నా పొన్నీ
నే సిన్నవోణ్ణిగానే
సిన్న జమీాలున్నవోణ్ణి
నిన్ను కన్నులలో పెట్టి
కలకాలం పూజిస్తా
మీా యన్నలతో సెప్పి
న న్నేలుకోవె సిన్నీ.

నీకన్న మెవురు నాకు
నే సిన్నదాన్నిగాను

మా యన్నలతో సెప్పి
అందాల బావ నన్ను

ఏ అడ్డు సెప్పకుండా
న న్నొడ్డునేయి బావా
నా కన్నవారి తోడూ
నా కంటి కునుకు లేదూ
నీ జంటమీద ఆసే
ఒంటారితనము రోతే
న న్నింటిదాన్ని సెయ్యి.

## తత్త్వం

జ్ఞానీ ఎరుగు
సుజ్ఞానీ ఎరుగూ
మంచీ నీళ్ళారుచి
మత్స్యా మెరుగును కాని
గుట్టాలంపట తిరిగే
కోడి ఏమెరుగూ... ॥జ్ఞా॥

పిల్లాలా ఆకలి
తల్లీ ఎరుగును కాని
అడవులంట తిరిగే
అయ్యా ఏమెరుగూ... ॥జ్ఞా॥
భార్యా చేసిన తప్పు
భర్త ఎరుగును కాని
వీధులంట తిరిగే
జోగీ ఏ మెరుగూ... ॥జ్ఞా॥

మల్లెపూల రుచీ
తుమ్మెదెరుగును కానీ
మనమీందా వాలేటి
ఈగా ఏ మెరుగూ... ॥జ్ఞా॥

## ఎట్టా పోనిత్తురా

కందిరీగ నడుముదాన్ని
ఎట్టా పోనిత్తురా ?
బెదురూ చూపులదాన్ని
ఎట్టా పోనిత్తురా ?
తుమ్మెద నెసులదాన్ని
ఎట్టా పోనిత్తురా ?
అట్టాటిట్టాటి దాన్ని
ఎట్టా పోనిత్తురా ?

## రవఁసిలక

మ॥ రంసుబలే రవఁసిలకా
అబ్బదాని సోకో జబ్బల
మీాద జాకెట్టు.
ఆ॥ ఆదివారం సంత
యీా అండెల్ కడాలెంతా ?
మ॥ ఏసుకోరాదా
ఏడణాలివ్వరాదా... ॥రం॥
ఆ॥ శుక్రోరం సంత
యీా సందెడుగాజు లెంత ?
మ॥ తొడుక్కోరాదా
తొమ్మిదణాలియ్యరాదా. ॥రం॥
ఆ॥ మంగళోరం సంతా
యీా మంచిముత్తాలెంతా ?
మ॥ మలుసుకోరాదా
ముప్పావలివ్వరాదా... ॥రం॥

# ఉడ్పుల పాట

నోమినోమన్నారె తుమ్మెదా
నోమన్నాలార ,,
కలువ రేకు లెకల్లు ,,
కలికి సీతమ్మావి ,,
ఆ అందసందాలు ,,
అవనిలోనే లేవు ,,
బంతులాడబోయే ,,
సీమంతి సీతమ్మ ,,
సీత బంతులయాట ,,
సిలకలే సూసాయి ,,
సీత సెలికత్తెలే ,,
సిగ్గులే పొందారు ,,
అంతలోనా బంతి ,,
అరిసేతులో తడి ,,
జనకుడూ తెచ్చినా ,,
సివునింటికింటికీ ,,
దొరులుసూపోయింది ,,
సీతసెలులను సూసి ,,
నవ్వుసూ పలికింది ,,
అమ్మ అతివాలార ,,
నా అందమైనాబంతి ,,
పెట్టెకిందికి పోమె ,,
తీసి యివ్వారమ్మ ,,
సెలులు అందరుగూడి ,,
సేతులూ కలిపారు ,,
సత్తవలు సూపారు ,,

బలములే సూపారు ,,
సివదేవుడీ యిల్లు ,,
కదలకే పోయెనూ ,,
నవ్వుతూ సీతమ్మ ,,
అంసనాగొచ్చింది ,,
తామరలె సేతులూ ,,
అరికాళ్ళు బంగారు ,,
అతి సులువుగాను ,,
అవలీల గెత్తింది ,,
జనకుడే సూశాడు ,,
దేవతలు సూశారు ,,
పుస్పవృష్టి కురిసె ,,
దేవుదుందుభులెల్ల ,,
దేవగోసలు సేసె ,,
జనకుడంతటతోను ,,
జానకొద్దకి వచ్చి ,,
సంబరముతో తాను ,,
తనపంతమే పలికాడు ,,
కన్న తల్లీ నిన్ను ,,
పొగడతరమూ కాదు ,,
దేవతలె జంకేరు ,,
రాచ్చసులు రానేదు ,,
నరులవశమూ గాదు ,,
నీ బలము సూడంగ ,,
నా మనసు పొంగానాది ,,
నీ బలముమించిన బలము ,,
నే నవని సూడాలేదు ,,
ఈ విల్లు విరిసేటి ,,

వీపునకె నిన్నెత్తు ,,
సీత సిగ్గుతోటీ ,,
సెలులతో సేరింది. ,,

## చందమామ

చల్లచల్లకొండమీద చందమామా
చదలేటి మాను మీద ,,
చదలేటి మాను మీద ,,
సరసాలాడేటోళ్ళు ,,
పొద్దూ ఎక్కించారు ,,
పొన్నలడేరాలూ ,,
మంచా మెక్కించారు ,,
మల్లెపువ్వు డేరాలు ,,
ఏరూ దాటించారు ,,
ఎఱ్ఱపువ్వు డేరాలు ,,

## ఏనుగు

ఏనుగమ్మ ఏనుగు
ఏ వూరెళ్ళింది ఏనుగు
ఉప్పా డెళ్ళిం దేనుగు.
ఉప్పునీళ్ళు తాగిం దేనుగు.
మన వూరి కొచ్చిం దేనుగు
మంచినీళ్ళు తాగిం దేనుగు.
అంబా రేసిన ఏనుగూ
అబ్బాయిని మోసిం దేనుగు.

# వేవిళ్ళపాట

నెలవెళ్లి పోద్దాయె
మొగడా
నెలబాలు డుద్దాడు
మొగడా
వేవిళ్ళు వచ్చాయి
మొగడా
కోరినవి పెడ్తావ
మొగడా
నేను పెట్టకపోతే
ఓసీ
నీ కెవరు పెడ్తారు
ఓసీ
కోరికలు చెప్పవే
ఓసి...
ఆరు వెలగాపళ్ళు నాకూ
అవి తెచ్చిపెట్టు
ఓ మొగడా
అరటిపళ్ళూ మంచి
దానిమ్మ పళ్ళు
వాటిమీద పోయింది
నా మనసు
మొగడా...
వేడుకలు చేయాలి
మొగడా
వేవెళ్ళ వెలకాయలు
మొగడా

చూలింత చుట్టయిన
మొగడా
అవి పంచిపెట్టాలి
మొగడా...
పొద్దున్నే లేచాడు
మొగుడూ
మంచిదీ చూసుకుని
మొగుడు
పైనమైపోయాడు
మొగుడూ...
సూర్యుడూ పొడిశాడు పాపం
చూలింత లేచింది పాపం
గంతలో కెళ్ళింది పాపం
ఇంటిలోకి రాకూడదు పాపం...
రాత్రికి వచ్చాడు పాపం
అన్నీని పట్టుకుని పాపం
ఓసీ, అని పిల్చాడు పాపం
ఇంట్లోకి రాకూడదు పాపం...
వేవిళ్ళు అని నన్ను ఓసీ
ఎంత భయపెట్టావే ఓసీ
ఒకరోజుకా యింత మోసం
నీకు తెలియకపోతే ఓసీ
నాకయినా బుద్ధిలేదా ఓసీ....

# జోలపాట

జోలల్లు పాడితే బాలలకు నిద్ర
నాగస్వరంపాడితే నాగులకు ఆట
చిట్టి చిట్టీ చిట్టి చీమల్లమట్టి
మట్టికిందవాడు తొట్టినాగన్న
తొట్టినాగన్నకీ తోడెవ్వరమ్మా
గోవుల్ని కాచేటి గోవిందుడే తోడు
అమ్మాయి నెవ్వరే కొట్టిన్నవారు
కొట్టిగోవుల పాలు కొనిపోసినారు
చిన్నారి పొన్నారి చిలుకవే నీవు
చిన్నమామిడి క్రింద చిన్నకోవెలవు
ఏడవకు ఏడవకు వెర్రి అమ్మాయి
ఏడిస్తె నీకళ్ళు నీలాలుగారు
నీలాలుగారితే నేజూడలేను
పాలైనగారవే బంగారుకండ్ల
హాయిహాయిహాయి ఆపదలుగాయి
చిన్నవాళ్ళనుగాయి శ్రీవెంకటేశ.

# ఓ బావా

ఓ బావ
ఓ బావ
ఓ బావా,
ఒడియాలు
తింటావా
ఓ బావా...

మరదల
మరదలా
ఓ మరదలా
ఒడియాలు
తినలేను
ఓ మరదలా...

ఓ బావ
ఓ బావ
ఓ బావా
పాలైన
పిండగలవ
ఓ బావ...

మరదల
మరదలా
ఓ మరదలా
బఱ్ఱెలంటె
భయమోలె
ఓ మరదలా...

ఓ బావ
ఓ బావ
ఓ బావా,
చేలోను
వంగగలవ
ఓ బావా...

మరదల
మరదల
ఓ మరదలా
చేనుకోత
మహాసరద
ఓ మరదలా...

ఓ బావ
ఓ బావ
ఓ బావా,
రావయ్య
చేలోకి
ఓ బావా...

మరదల
మరదల
ఓ మరదలా
ఉసారుగా
ఉండాదె
ఓ మరదలా...

# పొలిపదం!

ఒలియో ఒలియా ఒలియా
వేలుగలవాడా రారా పొలిగాడా.
ఊరికి ఉత్తరాన ఊడల మఱ్ఱి
ఊడలామఱ్ఱిక్రింద ఉత్తముడిచేత్రికె
ఉత్తముడి చబికెలో రత్నాలపందిరి
రత్నాల పందిట్లో ముత్యాలకొలిమి
గిద్దెడు ముత్యాల గిలకలా కొలిమి
అరసోలముత్యాల అమరినాకొలిమి
సోలెడుముత్యాల ఏడ్యాలకొలిమి
తవ్వెడుముత్యాల తరచినా కొలిమి
మానెడుముత్యాల మలచినాకొలిమి
అడ్డెడుముత్యాల అలచినాకొలిమి
తూముడుముత్యాల తూగనేకొలిమి
చద్ది అన్నముతినీ సాగించుకొలిమి
ఉడుకు అన్నముతని ఊదేనె కొలిమి
పాల అన్నముతిని పట్టెనే కొలిమి
ఊదేటి తిత్తులు ఉరుములామోలు
వేసేటి సంపెట్లు పిడుగులామోలు
లేచేటి రవ్వలు మెరుపులామోలు
చుట్టున కాపులు చుక్కలామోలు
నడుమకమ్మరిబిడ్డ చంద్రుణ్ణి బోలు...

## బస్తాదిగుమతి

హై లెసోయల్లా హైలెసో
ఓ మూకుకాడ హైలెసో
ఓ పిల్లాదాన ,,
ఓ పెళ్లిచేసుకుంటే ,,
ఆ పెద్దకాసులదండ ,,
ఆ పెట్టేదగానీ ,,
ఆ చుక్కారయికా ,,
ఆ కుట్టించిపెడ్తాను ,,
నీసన్న సన్నానీ ,,
నీనడుమూకూ ,,
నేనొక్క ఒడ్డాణం ,,
నేనేయించిపెడ్తాను ,,

## పచ్చగడ్డిపాట

పచ్చగడ్డి కోసేటి
పచ్చని పిల్లా
పయిటకొంగు జారిందే
పలుచని పిల్లా.

పచ్చల చొక్కా యేస్ని
పచ్చని బుల్లోడా
పయిటలోనె వున్నాది
పచ్చని చిలుకా.

పచ్చాని చిలుకంటే
పరదాలెగురుతాను
చేతికందిందంటె
చెప్పలేనా సోకు.

చిలుకలంటే యేటొ
చిందు లేతుండావు
పచ్చగడ్డి బీడులో
పరుగులాడి పట్టరా.

## దంపు

భావింప నేర్చితే
బావయే తండ్రీ.
మన్నింప నేర్చితే
మరదియే కొడుకు.
పూజింప నేర్చితే
పతియేను దైవము.
వడ్డింప నేర్చితే
వదినయే తల్లీ.

# కోడలి పాట

మా యింటి కోడాలు
మంచి ముత్త్యాము
సీటిమాటికి తాను
సీరాకు పడదు
పెందలాకడ లేచి
పాసి చేసేసి
యిల్లలికి ముగ్గెట్టి
యీాదిలో తుడిసి
కల్లాపు జల్లేసి
గొడ్లమే తేసి
నీలాటి రేవుకు
నెమ్మదిగ బోయి
నీళ్ళు తెత్త్తాదమ్మ
నిత్తె ముత్తైదు
అత్తమామాలాకు
ఎత్తళ్ళు బెడ్తు
పెనిమిటెని సిరికంట
పలకరిత్తాది
మరుదులను మంచిగా
మందలిస్తాది
తోడికోడళ్ళనూ
తోటోళ వలెనే
గారవిత్తాదమ్మ
గారమ్మ తల్లి.

# నలుగుపాట

నలుగిడవేగ రాగదే
యిందుముఖీ.
పిలచిన పలుకావేలనే.
కలికిరో చిలుకాలా
కొలికిరో ముత్యంపు
కలికినే విడువాజాలనే
చిలుకాలా కలికినే
విడువా జాలానే...... నలు॥

కొమ్మరో విరజాజి
రెమ్మరో గోర్జంగి
కొమ్మని నే విడువా
జాలనే కుందనంపు బొమ్మ
ని నే విడువాజాలనే...... నలు॥

వాసిగా తిరూపతీ
వాసియైనా పద్మావతి నీ
కోరి పాడుచును
చిలుకాలా కలికి నే
విడువా జాలనే...... నలు॥

# శ్రీకృష్ణుడుమీద

ఎవ్వరేనా స్వామి నవ్వుల్లతండ్రి
నువ్వుముఖముతో నాతండ్రి కృష్ణా
పువ్వుటుయ్యాలలోను పొంగి యూగుమురా
నిద్రపో నిద్రపో నీలవమందా
బలభద్రు తమ్ముడా హరి నిద్రపోరా
నిద్రకూ వెయ్యేండ్లు
నందగోపకుమారా నవనీత-చోరా
మంధరగిరిధారా మాధవకృష్ణా
ఏడువకు నాతండ్రి ఏడువకు కృష్ణా
పాడి యూచెదనిన్ను బాలగోపాలా

# ప్రశ్నలు

వడ్లు పండించావు ఓనాధా
యిపుడు వడ్లల్లో వరి పొల్లు
ఎందుకున్నాది?
మారుదేశామెల్లి
మగువలతో గూడి
మళ్ళకే నీరెట్టి
మరచితివి రాజా.
కూడువండీ నావు
ఓ కుసుమగన్నీ
కుండపై సారల్లు
ఎందుకున్నాయి.
నల్లకొండానుంచి
నా తమ్ములొస్తే

మాటలామధ్యనా
మరచితిని రాజా.
అరటి అకులమీాద
వడ్లెండబోసి
అరుగెక్కి నే చూసె
అయ్యో బలముమ్మ
మా నాన్న వేసిన చేను
ఏమి పండింది?
రాజసము పండింది
రాసులవగోరిందీ.
మా తాతవేసిన చేను
ఏమి పండింది.
తప్పలై పండింది
తాలుకోరింది.

## తారంగం

తారంగం, తారంగం
తాండవకృష్ణ తారంగం
వెన్నదొంగా తారంగం
వేణూనాథా తారంగం
చిన్నికృష్ణా తారంగం

# గుమ్మాడిపాట

గుమ్మాడమ్మా గుమ్మాడి
పందిరే ఎక్కింది గుమ్మాడి
చిగురే వచ్చింది గుమ్మాడి
ఆకులే వేశాయి గుమ్మాడి
పువ్వులే పూచాయి గుమ్మాడి
కాయలే కాచాయి గుమ్మాడి
పండు గుమ్మడికాయల్లు
పచ్చబడ్డాయి
నాన్నతో చెపుతాను
రార తమ్ముడా
అక్కతో నే నొక్క
మాట చెబుతాను
అంత పెద్దకాయల్లు
తీగల్లు మోసె?
తీగ కాయకు బరువు అని
చెప్పలేదా.
మన అవ్వ మనతోటి
మరచిపోతీవా.
అమ్మరో దప్పళం
బాగవండావే.
నాకెంత యిష్టమో
నీకు తెలుసూనె...

# తొక్కుపల్కులు

ధిమిత ధిమిత
ఏమి ధిమిత
పసుపు ధిమిత
ఏమి పసుపు
వంట పసుపు
ఏమి వంట
పిండి వంట
ఏమి పిండి
తెలక పిండి
ఏమి తెలక
గొర్రె తెలక
ఏమి గొర్రె
పాల గొర్రె
ఏమి పాలు
జెముడు పాలు
ఏమి జెముడు
పాత జెముడు
ఏమి పాత
గోచి పాత
ఏమి గోచి
పట్టు గోచి
ఏమి పట్టు
చెంప పట్టు.

# చాకిరేవుపాట

మంగమ్మా...
సాకిరేవు బల్లకాడ సంగతీ
నీ సక్కదనము కాలిపోను
సుక్కలాటి మంగమో...సా॥
నున్నని బల్లమీద
సాగతీసి కొడుతుంటే
మంగమా –
సాగతీసి కొడుతుంటే
బట్టలు సాగతీసి
కొడుతుంటే
నీ కష్టము సూసీ మనసు
ఇష్టపడది మంగమో—సా॥
తాజాగా తాటెకల్లు
మజాగా మాపిటికీ
మాయవరం సంతలోన
మారిపోదాం మంగమో...సా॥

# ఆముదం పాట

జీర్ణం జీర్ణం
వాతాపి జీర్ణం
గుఱ్ఱము తిన్న
గుగ్గిళ్ళు జీర్ణమై
ఏనుగు తిన్న
వెలక్కాయ జీర్ణమై
భీముడు తిన్న
పిండివంటలు జీర్ణమై
అబ్బాయి తిన్న
పాలూ ఉగ్గూ జీర్ణమై
కుందిలాగా కూర్చుని
పందిలాగ పాకి
లేడిలాగ లేచి
నందిలాగ నడిచి

# రంగం పాట

మ॥ నే రంగమెల్లిపోతానె నారాయణమ్మ
నాను నబ్బురెల్లిపోతానే నారాయణమ్మ
అ॥ పోతేపోయావుగాని నాయుడుబావ
నాకు పోగులజత తెత్తావా నాయుడుబావ
మ॥ పోగుల జత తెత్తేను నారాయణమ్మ
నువు పొంగిబోర్లబడతావే నారాయణమ్మ
అ॥ కాసులపేరు తేవోయి నాయుడుబావ
నాకు కంటె తెచ్చిపెట్టవోయి నాయుడుబావ
మ॥ కాసులపేరు తెత్తేను నారాయణమ్మ
నా ఆశలన్నీ తీరుత్తావ నారాయణమ్మ

# ప్రశ్నలు-
# సమాధానాలు

కలుపు తియ్యి
కలుపు తియ్యి
పిల్లా నీవూ—

కలుపంటే
కడుపు మంట
అయ్యా నాకూ.

మరేమి పనులు
చేయఁగలవు
పిల్లా నీవూ-

మరన్నీ పనులు
చేయఁగలను
అయ్యా నేనూ.

కూరొండు
కుమ్మొండు
పిల్లా నీవూ-

కూడొండ
కునుకొచ్చు
అయ్యా నాకూ.

కోతకెళ్ళు
మోతకెళ్ళు
పిల్లా నీవూ-

కోతంటే
రోతేస్తే
దయ్యా నాకూ.

సంతకెళ్ళి
సరసమాడు
పిల్లా నీవూ—

సంతంటె
సంబరాలు
అయ్యా నాకూ.

## రక్ష

ఆయీ, ఆయీ,
ఆపదలను కాయీ.
చిన్నవారిని కాయి
(శ్రీ) వెంకటేశ.
అబ్బాయి కన్నులూ
బీరపూవుల్లూ
అమ్మాయి కన్నులూ
కలువ రేకుల్లూ
ఆయీ, ఆయీ...

## గుజ్జింపాట

గుడి గుడి గుంజం
గుండారాగం
పాములపట్టం
పడగారాగం
అప్పడాల గుజ్జిం
ఆటకిబోతే
పే పే గుజ్జిం
పెత్తనానికిపోతే
కత్తెయ్యనా బద్దెయ్యనా?
కాకరచెట్టుకు నీళ్లోయ్యనా?

## చెరువునుంచి

ఈ యూరి కుమ్మరి యిల్లు నే నెరుగ
చెయ్యాలి కుమ్మరి గజ్జెల్ల కడవ
గజ్జెల్ల కడవికి ఏ బావి నీళ్ళు
పేరైన యిసుకాల పెదబావి నీళ్ళు
బుడుగు బుడుగున ముంచి
మోకాట బెట్టి
అక్కడిక్కడ చూచి కట్టపై చూచి
కట్టమీాద పొయ్యేది ఎవరయ్య మీారు
కట్టమీాద పోయేటి గాజుల్ల సెట్టి
నేనొచ్చి తడవాయె కడవెత్తవయ్య
కడవపేరు ఏం పేరు నీపేరు ఏమి
కడవపేరు గంగమ్మ నాపేరు సీత

అయిపోయె గౌరమ్మ అయిపోయెనమ్మ
ఐపైన గిరిమీద అడిగిరావమ్మ
మా జొన్నలయిపోయె మేము పోతాము
మళ్ళొచ్చి నీ పాటలెల్ల పాడేము.

## పురిటింటి పాట

మా యింటి పురిటాలూ
ఏమీ కోరిందీ.
కుక్కీ మంచమ్మూ
గూనా కుంపాటీ... ॥మా॥

తొలుచూలు కొడుకూనీ
కానాకోరిందీ... ॥మా॥

ఎఱ్ఱని తాంబూలం
కాటుక కోరిందీ... ॥మా॥

చక్కని పిప్పాలీ
ఖాయం కోరిందీ... ॥మా॥

ఉల్లీ ఖారమ్మూ
శొంఠీ కోరిందీ... ॥మా॥

చక్కని సలువాలూ
కట్టాకోరిందీ... ॥మా॥

ఏటా చూలింతా
బాలింత కోరిందీ... ॥మా॥

# ఏరువాక!

వేర్చి కట్టేడు ఎల్లెడ్ల బంతి
ప్రొద్దున్న కట్టేడు బొల్లెడ్ల బంతి
వెండికన్నెలకట్టేరు ఎల్లెడ్లబంతి
పయిడికన్నెల కట్టేరు పైమెడ్లబంతి
బొడ్డుకన్నెల కట్టేరు బొల్లెడ్ల బంతి
కంచుకన్నెలకట్టేరు కర్రెడ్లబంతి
బద్దికన్నెలకట్టేరు పుల్లెడ్లబంతి
అనితొక్కెనుస్వాములు హస్తములు మొయ్య
అనితొక్కినస్వాములకు ఏమిలంచాలు ?
అనితొక్కినస్వాములకు మురిడీలగొలుసులు
అనితొక్కినస్వాములకు కొమ్ములకుతొళ్ళు
అనితొక్కినస్వాములకు దండకడియాలు
అనితొక్కినబోడెడ్లకు బొడ్లొగంటలు.

# ధర్మం

ముసలాడు మా తాత
పసనిమ్మ పండు
నవ్వుతూ అన్నమ్మ
నంది పూజించి
ఆ నంది పూజలకు
నీళ్లు తేవనను
తవ్వించె మా తాత
తోవల్ల చెరువు
తోవల్ల చెరువుకి

తోడు లేదనుచు
వేయించె మా తాత
ఊడలా మర్రి
ఊడలా మర్రికి
ఎరువు లేదనుచు
గడుపార ఎరువెట్టి
గంగ నీరెట్టి
చెరువు పక్కన నిమ్మ
తోట వేశాడు
చుట్టూతిరుగ ఎరువెట్టి
నిమ్మ నీ రెట్టి
ఆ తోవ వెళ్ళేరు
పెద్దబావల్లు
ఆ నీరు త్రాగారు
నీడ బడ్డారు
ఆ పళ్ళు తిన్నారు
పాట పాడేరు
కూడు తిన్నట్టుగా
పళ్లు తిన్నారు
పుణ్యావంతుడి తోట
విరగ కాయాలి.

# గాజులపాట

గాజులశెట్టి వచ్చాడె
గారమ్మ తల్లి.
గాజులబ్బి వచ్చె
గంగమ్మ తల్లి.
అమ్మ పిలిచి రమ్మంది
అక్కరో నన్ను.
నేను పిలచి వచ్చానె
అక్కరో చూడు.
అక్కరో నువ్వు ముందు
గాజులకు వెళ్లే.
నీకు పెళ్లన్నదే
అమ్మ నాతోనూ.
రంగు రంగుల గాజులే
రంగైన గాజులూ.
అక్కరో నువ్వుముందు
వేయించుకోవే.
గాజుల్ల శెట్టి రాఓయి
గారి వచ్చింది.
కంబళ్లు పరువవోయి
గాజుల్ల శెట్టి.
గౌరిదేవి రావే చెయి
చేతికియ్యావే.
ఏలాటి గాజులో
ఎంచి చూసుకోవే.
దారుగాజులెయ్యా నా
తల్లి గారమ్మ

అద్దాలగాజులా
అవిచూడవమ్మ.
నీవు కోరిన గాజులూ
నువు వేయించుకోవే.
నీలాలగాజులూ అవి
వెయ్యవోయి.
నా చెయ్యి కందకుండ
నెమ్మదిగ వేయి.
గౌరమ్మ కేశాను
గంగమ్మ రావే.
నీ కేమి గాజులో
నువ్వేంచుకోవే.
నా చేతి గాజులూ
హస్తకంకణాలూ.
నా చేతిగాజులే
అవి మెరుపుగాజులూ.
నా గాజులమోతకే
జగమెల్ల ఒణుకు.

# గచ్చకాయలాట

ఒక్కా ఓ చెలియా
రెండూ రోకళ్ళూ,
మూడూ ముచ్చెలుకా,
నాలుగూ నందన్నా,
అయిదూ చిట్టి గొలుసూ,
ఆరూ ధారాలూ
ఏడుం భేడీలు
ఎనిమిది మనమండీ
తొమ్మిది తోకచ్చా
పదీ పట్టేడా.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10313

## ఓ బాలలారా....?

వీధులనాడేటి ఓ బాలలారా
మాబాలనెందైన కంటిరా మీరు
అమ్మ మీబాలకు ఆనవాలేమి?
జడజడా రత్నాలు జడరావిరేకు
పాపట పన్నీరు నొసట కస్తూరి
రాలేద మాబాల మిముగూడియాడ
ప్రొద్దుప్రొద్దొకచాయ ప్రొద్దొక్కచాయ
ప్రొద్దున్న అమ్మాయి మల్లెపూచాయ
జాముజామొక చాయ జామొక్కచాయ
జామున్న అమ్మాయి జాజిపూచాయ
ఒక్కొక్క ముత్యము వనకూడినట్లు
ఒప్పేటి కోమాళ్ల ఏ తల్లికనెనో
రమణులా కన్నదే తాను కౌసల్య
ఊరికి ఉయ్యాల లమ్మొచ్చినాయి
కొమాళ్ళకన్న తల్లి కొనవే ఉయ్యాల !
కోటివేలుపోసి కొనెను ఉయ్యాల!!

★

BCI

A0UA103B/29



IB

# సాహిత్య గ్రంథాలు

★

| | | |
|---|---|---|
| ప్రజావాఙ్మయము | చింతా దీక్షితులు | 1-50 |
| ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజం | గిడుగు రామమూర్తిపంతులు | 2-50 |
| వ్యాసావళి | ,, | 2-50 |
| బాలకవి శరణ్యం | ,, | 4-00 |
| వ్యాసచంద్రిక | గురజాడ అప్పారావు | 1-50 |
| కొండుభట్టీయం - బిల్హణీయం | ,, | 1-50 |
| డైరీలు | ,, | 2-50 |
| మాటా, మంతీ; అవీ ఇవీ | ,, | 2-75 |
| లేఖలు | ,, | 2-50 |
| ముత్యాలసరాలు | ,, | 1-00 |
| ఆణిముత్యాలు | ,, | 1-00 |
| ఆంధ్రసాహిత్య పునర్వికాసం | మద్దుకూరి చంద్రశేఖరరావు | 0-75 |
| రచయితా - శిల్పము | ఇల్యా ఎహ్రెన్‌బర్గ | 0-75 |
| మనోవికాసానికి మేటిబాట | | 0-75 |

(పోస్టేజి అదనం)

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

ప్రతులకు :

## విశాలాంధ్ర ప్రచురణాలయం

బకింగ్‌హాంపేట : : విజయవాడ.

స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, విజయవాడ-2.

**మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక**

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA103B129 |
| పుస్తకం పేరు | జానపద గేయాలు02 |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 84 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | c1 Bc1 |
| లేని పేజీలు | 45,46 |
| తయారు చేసినది | Kethuva |
| పేజీలు విడదీసినది | Kethuva |
| స్కాన్ చేసినది | C.Nageswari |
| పరీక్ష చేసినది | SARANYA |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |